

బోదవ్యాధి నివారణకు సహకరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

బోదవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించే ఇంటింటి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సహకరించాలని డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ ప్రియదర్శిని కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కరక హిమ మహేశ్వరి అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణులు, రెండేళ్ల లోపు బాల బాలికలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ మాత్రలు వేసుకోరాదన్నారు. అందరూ భోజనం చేసిన తర్వాత మాత్రమే ఈ మాత్రలు వేసుకోవాలని ముందుగా సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కె.మోహన్ రావు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



కాజులూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కౌలు రైతులు

వ్యవసాయానికి సబ్సిడీలు పెంచాలి

ప్రజాశక్తి - కాజులూరు

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి సబ్సిడీలు పెంచాలని కోరుతూ సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులతో ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు నష్టం చేకూర్చే బడ్జెట్ అని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆక్షేపించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ చాలా మోసపూరితమైన బడ్జెట్ అని ఈ బడ్జెట్ను మరో సారి పున సమీక్షించాలని వ్యవసాయంపై ఇచ్చే సబ్సిడీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. గత ఏడాది వ్యవసాయానికి ఇచ్చే బడ్జెట్‌తో పోలిస్తే ఈ సంవత్సరం ఎరువుల సబ్సిడీపై 50 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. అలాగే ధాన్యం సేకరణ కోసం కేటాయించి నిధుల్లో మరో 50 వేల కోట్లు ఆహార సబ్సిడీపై 90 వేల కోట్లు వ్యవసాయ అవసరాల కోసం కేటాయించి వాటిలో ఎనిమిది వేల కోట్లు ఉపాధి హామీ పథకానికి 30 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ నష్టాల్లో ఉండని సబ్సిడీలు పెంచవలసింది పోయి సబ్సిడీలు తగ్గించడం వల్ల ఎరువుల భారం రైతుపై పడుతుందన్నారు. ఇప్పటికే ఎరువులు కొనలేని పరిస్థితిలో రైతాంగం ఉందని, ధాన్యం సేకరణకు నిధులు తగ్గించడంవల్ల ధాన్యం కొనుగోలుకు ఆటంకం ఏర్పడ నుందని అందుచేత మరోసారి సమీక్షించి సబ్సిడీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి సర్వేశ్వరరావు, రెడ్డి సత్య నారాయణ, చొల్లంగి రామకష్ణ, పెద్దింశెట్టి నాగేశ్వంరావు, కేత అన్నవరం, రెడ్డి నాగేశ్వరరావు, చొల్లంగి వెంకట రమణ, కె.సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



కాకినాడ ధర్నా చౌక్ వద్ద జరిగిన అంగన్‌వాడీల మహా ధర్నా సభలో ప్రసంగిస్తున్న సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు బేబి రాణి

కదం తొక్కారు

- సమస్యలపై అంగన్‌వాడీల మహాధర్నా
- తరలి వచ్చిన వందలాది వర్కర్లు
- భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు కదం తొక్కారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో జరిగిన మహదర్నాలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని,జీవో నెంబర్1ను తక్షణమే రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

మహాధర్నా సభలో సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాజ్‌కుమార్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఇ.చంద్రావతి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం నిరంకు శంగా వ్యవహరిస్తోందని, వాటిని పరిష్కరించమని న్యాయబద్ధంగా అడిగితే అక్రమంగా అరెస్టులు చేయడం శోచనీయ మన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు తెలంగాణలో ఇస్తున్న వేతనం కంటే అదనంగా రూ.1000 చెల్లిస్తానని చెప్పి, నేడు తెలంగాణ రాష్ట్రం కంటే రూ.2 వేలు తక్కువ వేతనాలు చెల్లిస్తూ మాట తప్పారన్నారు. కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేస్తూ జీవో ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫుడ్ కమిషనర్ ప్రతాప్‌రెడ్డి చిరుద్యోగులపై చిన్నచూపు చూస్తూ మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. చేతనైతే అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పెట్టే మెనూ సరుకులు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే సెంటర్లను ఎలా నిర్వ హించాలని ప్రశ్నించారు. కనీసం నెల నెలా వేతనాలు కూడా చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితికి జగన్ ప్రభుత్వమే బాధ్యత వహించా లన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో మహిళల సానిటరీ నేప్కిన్స్‌పై కూడా పన్నులు వేస్తూ, పెట్రోల్, డీజిల్ ధరలను రోజురోజుకీ పెంచుతూ నిత్యవసర సరుకులు ధరలను విపరీతంగా పెంచుతోందని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల పిల్లలకు పౌష్టిక ఆహారం అందించే ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు తగ్గించి పేద పిల్లలకు అన్యా యం చేశారని, గర్భిణులు, పిల్లలు తినగలిగేలా నాణ్య మైన పౌష్టికాహారం అందించాలని, పేదలకు సేవచేసే అంగన్‌వాలకు కేంద్ర ప్రభుత్వం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్లధనం తీసుకొచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. ఫేస్ యాప్ రద్దు చేసేంతవరకు ఈ ఆందోళన కొనసాగి స్తామని హెచ్చరించారు. చేసే పని ఒకేలా ఉన్నా.. మినీ వర్కర్ అనే పేరుతో గొడ్డుచాకిరి చేయించుకుంటున్నారని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. తాళ్లరేవు సీడీపీవో అంగన్వాడీలపై వేధింపులకు పాల్పడుతూ ఉద్యోగుల చేత బలవంతపు రాజీనామాలు చేయించడం మానుకుని, తొలగించిన వారిని విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులతో పెద్దాపురంలో తొలగించిన బ్రహ్మకుమారి అనే అంగన్‌వాడీ వర్కర్‌ను తక్షణమే విధులలోకి తీసుకో వాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం దశలవారి పోరాటాలకు అంగన్‌వాడీలు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. మహా ధర్నా సందర్భంగా పోలీసులు భారీగా మోహరించారు. అధిక సంఖ్యలో మహిళా పోలీసులను కాపలాగా ఉంచారు. కలెక్టరేట్ వైపు వెళ్లనీయకుండా నాలుగు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల ఈశ్వరి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సత్తిరాజు, కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు మద్దతుగా సౌహార్ద సందేశం అందించారు.ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం పిఠాపురం సిడిపివో దుర్గాదేవికి అందించారు.



ప్పారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉత్తర్వులు అందిస్తున్న దొరబాబు

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని బోయినపూడి గ్రామానికి చెందిన చల్లా అప్పారావుకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఇటీవల ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చల్లా అప్పారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన లక్ష రూపాయల సహాయాన్ని సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద హౌసింగ్ చైర్మన్ దొరబాబు అందజేశారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

నాలుగు రోజులపాటు నిర్వహణ 10 ప్రాంతాల్లో ఏర్పాటు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, మెయిల్ అడ్రస్ అనుసంధానం, బయోమెట్రిక్(ఫొటో, ఐరీష్, వేలిముద్ర) అప్‌డేట్, పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు, చిరునామాలో మార్పులు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం, కొత్తగా ఆధార్ నమోదు వంటి సేవలను ప్రత్యేక శిబిరాల్లో పొందవచ్చునని కమిషనర్ చెప్పారు. కాకినాడ నగరంలోని 1 నుంచి 5వ డివిజన్ వరకు కృష్ణనగర్‌లోని 2ఎ సచివాలయం లోను, ఆరు నుంచి 12వ డివిజన్ వరకు డైరీఫారం సమీపంలోని 11ఎ సచివాలయంలోను, 14,18,19,20 డివిజన్లకు గోళీలపేటలోని 14ఎ సచివాలంలోను ఆధార్ సేవలు ఉంటాయన్నారు. 15, 16, 17, 25, 26 డివిజన్లకు యానాంలో రోడ్డులోని 15ఎ సచివాలయంలోను,. 21 నుంచి 24 డివిజన్ల వరకు చినమార్కెట్ సమీపంలోని 21ఎ సచివాలయంలోను, 27నుంచి 29 డివిజన్ల వరకు యాళ్ళవారివీధిలోని 28బి సచివాలయంలోను ఏర్పాటు చేశామన్నారు. 30,35,36, 37 డివిజన్లకు సంబంధించి జగన్నాథ పురం సమీపంలోని 30బి సచివాలయంలోను, 13, 31, 32, 33, 34 డివిజన్లకు బ్యాంక్‌లోని 31ఎ సచివాలయంలోను ఆధార్ సేవలు లభిస్తాయ న్నారు. అలాగే 38 నుంచి 43వ డివిజన్ వరకు గాంధీనగర్ 38బి సచివాలయంలోను, 44 నుంచి 50వ డివిజన్ వరకు గైగోలుపాడు 50బి సచివాలయంలోను ఆధార్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ రమేష్ స్పష్టం చేశారు.

వాకపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం వాకపల్లి గ్రామంలో నర్సీపట్నానికి చెందిన లోటస్ నేత్ర వైద్యశాల సిబ్బంది సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు ప్రారంభించగా నేత్ర వైద్యులు రాజశేఖర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వర్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్ నాగలక్ష్మి సేవలందించారు.



కోటనందూరులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్ల

జిల్లా స్పందనకు 182 అర్జీలు

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరులో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి పెన్షన్లు, ఇల్లు స్థలాల కోసం, రేషన్ కార్డులు భూ సమస్యల పైన182 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదు చేసిన ప్రతి సమస్య పైన క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయా శాఖ అధికారులతో ఆ సమస్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లా కోటనందూరు జడ్పి హై స్కూల్‌లో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి, విద్యార్థులతోమాట్లాడి వారి విద్యా నాణ్యత ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అల్లిపూడిలో కస్తూరి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాల యాన్ని, గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. బోదవరం గ్రామంలో రైతులకు పండించిన పంటలను మార్కెట్‌కు తరలించడా నికి తాండవ రిజర్వాయర్ నదిపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులను, మంత్రి దాడిశెట్టి రాజాను దృష్టికి స్థానిక రైతులు తీసుకుని వెళ్లడంతో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆవె వెంట జాయింట్ కలెక్టర్ ఇలాక్కియా, జడ్‌పి సిఇఒ ఎన్‌వివి సత్యనారాయణ, పెద్దాపురం ఆర్‌డిఒ,అధికారులు ఉన్నారు.

పోలీస్ స్పందనకు 59 అర్జీలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 59 అర్జీలు వచ్చాయని ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు తెలిపారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, ఇతర సమస్యలకు సంబంధించిన వాటిపై సదరు ఫిర్యాదుదారుల నుంచి వినతులు అందాయని, సకాలంలో వీటిని పరిష్కరించేందుకు సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.శ్రీనివాస్, డిఎస్‌పిలు ఎం.అంబికా ప్రసాద్, పి.మురళీకష్ణారెడ్డి, కాకినాడ నగరం సిఐలు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. **కార్పొరేషన్ కార్యాలయంలో** సోమవార స్పందన కార్యక్రమంలో కమిషనర్ కె.రమేష్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పద్వీ చరణ్, మేనేజర్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోటనందూరు జడ్‌పి పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ కృతిక



ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

ఎస్‌పిని కలిసిన అమరవీరుల కుటుంబాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తీవ్రవాద వ్యతిరేక పోరులో విధులు నిర్వహిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం వారు కేటాయించే స్థలాల విషయంలో ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా స్వీయ పర్యవేక్షణలో వెంటనే స్థలాల కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవడం తమ కుటుంబాల్లో ఆనందాన్ని నింపిందని అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులు ఎస్‌పిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు అన్ని విషయాల్లోనూ జిల్లా పోలీసు శాఖ అండగా నిలుస్తుందని ఎటువంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తగిన కృషి చేస్తానని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి ఆదేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోజగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి అయ్యేందుకు లబ్ధిదారులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని హౌసింగ్ డిఇ ఆర్‌ఎస్‌కె రాజు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంబంధిత సిబ్బందితో ఏర్పాటుచేసిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్త అవ్వాలన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులు గుర్తించి వారి సమస్యలు పరిష్కరించి ఇళ్ల నిర్మాణాలలో వారికి సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, పంచాయతీల కార్యదర్శిలు పాల్గొన్నారు.

నేర రహిత సమాజ స్థాపనకు ఐక్యంగా కృషి

జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఘన సన్మానం


ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఇదే ఒరవడిని భవిష్యత్‌లో కూడా కొనసాగించి నేర రహిత సమాజ స్థాపన లక్ష్యంగా సమన్వయంతో కలిసి పనిచేద్దామని కోరిన ఎస్‌పి ఎం రవీంద్రనాథ్ బాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి కె.వి రాజేంద్ర నాథరెడ్డి ఆదేశాలు అనుసరించి ఎస్పీ పర్యవేక్షణలో జిల్లాలోని వివిధ కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘన సన్మానించారు. జిల్లాలో అమల్లో ఉన్న కన్విక్షన్ బేస్డ్ కోర్టు ట్రయిల్ మానిటరింగ్ సిస్టం ద్వారా స్థానిక పోలీస్ అధికారులు, సంబంధిత విచారణ కోర్టులలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు చేసిన పోలీసు అధికారుల సమన్వయంతో కాకినాడ జిల్లాలో గత నాలుగు మాసాల కాలం నుండి విచారణలో ఉన్న మూడు ఫోక్సో చట్టం కింద విచారించబడిన కేసులు, మూడు హత్యా నేరం కింద విచారించబడిన కేసులు, ఒక ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక చట్టం కింద విచారించబడిన కేసులలో యావజ్జీవ శిక్షల తీర్పులు గౌరవ న్యాయస్థానాల నుండి రావడం శుభపరిణామమనారు. కార్యక్రంలో కాకినాడ జిల్లా డిప్యూటీ డైరెక్టర్, ప్రాసిక్యూషన్స్ ప్రశాంతి కుమారి, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయస్థానం గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు గా పనిచేసిన ప్రకాష్ , ఆదిత్య కుమార్, ప్రస్తుత ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిపిని సత్కరిస్తున్న ఎస్‌పి, ఎఎస్‌పిలు

కార్టూ'నిజం'



ఫోన్లు టాపింగ్ చేయొద్దనా..!!

పాదయాత్రను విజయవంతం చేస్తాం...

-మూడు రోజుల చంద్రబాబు పర్యటన

- టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు నవీన్ వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

యువగళం పేరుతో టిడిపి యువనేత చేపట్టిన పాదయాత్రను ఎవరెన్ని అడ్డం కులు సృష్టించినా విజయవంతం చేసి తీరతామని టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెలిపారు. సోమవారం కాకినాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నానని, పజల నుంచి వస్తున్న అభిమానం, ఆదరణ చూస్తుంటే అధికార పార్టీలో వణుకు మొదలైందన్నారు. లోకేష్ పాదయత్రకు వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి అడ్డంకులు సృష్టిస్తోందని, పబ్లిక్ సమావేశాలు పెట్టుకుంటే పూర్తి స్థాయిలో భద్రత ఇవ్వడం లేదన్నారు. తెలుగు దేశం వాలంటీర్‌ల సహాయంతో సమావేశాలను విజయవంతం చేసుకుని ముందుకు సాగుతు న్నామన్నారు. 15న గోకవరం మీదగా జగ్గంపేట రోడ్ షో, మధ్యాహ్నం సమావేశం, 16న జగ్గంపేటలోనే ఉండి తరువాత రోజున జగ్గంపేటలో ముఖ్య నాయకులతో సమావేశం, అనంతరం పెద్దాపురం చేరుకుని, బహిరంగ సభలో పాల్గొంటార న్నారు. అదే రోజున సామర్లకోటలో బస చేసి ఆ తరువాత రోజున అనపర్తి చేరుకుని పలు సమావేశాల్లో పాల్గొంటాని తెలిపారు. 2కాగా ఈ నెల 9న నాలుగు జిల్లాల ముఖ్య నాయకులతో పర్యటనకు సంబంధించి సమావేశం నిర్వహించనున్నట్ట తెలిపారు. సమా వేశంలో వైవీ దాసు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** లోని టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు పోతుల మోహన్‌వు ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు వెలమాటి కాశి అధ్యక్ష టిడిపి పార్టీ విస్తత సమావేశం సోమవారం నిర్వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జగ్గంపేట నియోజకవర్గం పర్యటన విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్ర మంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కో ర్పు సాయి తేజ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ ఉండవిల్లి వీర్రాజు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న డాక్టర్ నాయుడు, సిసిఆర్ హెడ్ పల్లవి

బజాజ్ ఫిన్‌సర్వ్ తో 'ఆదిత్య' ఒప్పందం

ప్రజాశక్తి - కాకినాడ.

విద్యార్థులలో బ్యాంకింగ్, ఫినాన్స్, ఇన్స్యూరెన్స్ విషయాలలో జ్ఞానాన్ని మెరుగుపరిచేందుకు పూణేకు చెందిన ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ బజాజ్ ఫిన్‌సర్వ్‌తో ఆదిత్య డిగ్రీ కళాశాల పరస్పర ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు కాకినాడ ఆదిత్య కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ నాయుడు బజాజ్ ఫిన్‌సర్వ్ సిఎస్‌ఆర్ హెడ్ జి పల్లవి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం బజాజ్ ఫిన సర్వ్ ప్రోగ్రామ్ బ్యాంకింగ్, ఫైనాన్స్, మేనేజింగ్ సెల్ఫ్ అండ్ కమ్యూనికేషన్, వర్క్ ప్లేస్ స్కిల్స్‌లో 100 గంటల శిక్షణా కార్యక్రమాన్ని అందిస్తుందని నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, బజాజ్ ఫిన్‌సర్వ్ ట్రైనింగ్ పార్టనర్, ప్రాజెక్ట్ మేనేజర్ రష్మీ మన్సుఖాని, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ ఎన్.మూర్తి పాల్గొన్నారు.

కృషితో ఉన్నత లక్ష్యాల సాధన

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను సాధించే ప్రయత్నంతో కృషి చేస్తే సత్ఫ లితాలు లభిస్తాయని ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి, మాజీ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) డాక్టర్ ఐవి. రావు అన్నారు. స్థానిక శాంతినగర్లోని శ్రీ అగస్త్య ఐఐటి- మెడికల్ అకాడమీలో అకాడమీ కరస్పాండెంట్, సీనియర్ ఫిజిక్స్, ఫ్యాకల్టీ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎస్‌ఆర్) అధ్యక్షతన నీట్ లాంగ్ టర్మ్ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ ఐవి.రావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను దైవంగా భావించి వైద్య వత్తిని భగవంతుడు ఇచ్చిన గొప్ప వరంలా భావించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ ఉపకులపతిగా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ)గా, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సలహాదారునిగా వ్యవహరించినట్లు డాక్టర్ ఐ.వి.రావు తెలియజేశారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యునిగా పనిచేయడంతో వేలాది మంది పేద, మధ్య తరగతి రోగులకు మెరుగైన సేవలందించే భాగ్యం కలిగిందన్నారు.శ్రీ అగస్త్య అకాడమీలో దశాబ్దాల అనుభవం గల ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అధ్యాపకులు అందించే విలువైన విద్యా బోధనను విద్యార్థులు సద్వినియోగపర్చు కోవాలని ఆయన కోరారు. అనంతరం విద్యా ర్థులు వైద్య విద్యపై తమకున్న అనుమానాలను ప్రశ్నల రూపంలో అడిగి నివత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ ఐవి రావు

నేరాలు ఘోరాలు


ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బొలెరో వాహనంపై లారీ బోల్తా

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - కాకినాడ రోడ్‌లో లాకుల వద్ద ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి బొలెరో వాహనంపై బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ వెనక భాగం పూర్తిగా పాడైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. పెద్దాపురంలోని ఒక రైస్ మిల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్ట్‌కు వెళ్తున్న లారీ ఉండూరు రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు వచ్చే సరికి అదుపుతప్పి అటుగా వెళుతున్న బొలేరో వాహనంపై బోల్తా పడింది. ఆ బొలేరో వాహనంలో ఉన్నవారు, లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వల్ల కొన్ని గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రమాద స్థలానికి స్థానిక పోలీసులు చేరుకుని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

చోరీల కేసులో ఇద్దరు అరెస్టు

54 సెల్ ఫోన్లు, 9 బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో సెల్‌ఫోన్లు, బైకులు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రత్తిపాడు సిఐ కె.కిషోర్‌బాబు తెలిపారు. తుని రూరల్ మండలం కొలిమేరుకు చెందిన బొందల అప్పారావు, ఎస్.కోట మండలం కొత్తవలసకు చెందిన బోదల సురేష్ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లో బైకులు, తుని, అన్నవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల మాదిరిగా ట్రైన్ ఎక్కి ఛార్జింగ్ పెట్టుకున్న సెల్ ఫోన్లను దొంగిలించి తక్కువ ధరలకు అమ్మే వారన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్ఐలు కె.సుధాకర్, జి.సతీష్, ఎఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది గోవింద్, ఎవిజి.కృష్ణ, సూర్యచంద్ర, సుబ్రహ్మణ్యం టీమ్‌గా ఏర్పడి ప్రత్యేక నిఘా ఉంచి చాకచక్యంగా దొంగలను పట్టుకున్నారని తెలిపారు. వీరిని ఎస్‌పి రవీంద్రబాబు. ఎఎస్‌పి పి.శ్రీనివాస్, పెద్దాపురం డిఎస్‌పి సుంకర మురళీమోహన్ ప్రత్యేకంగా అభినందించారు..

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం శివారు ఏలేరు నది పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఏలేశ్వర ఎస్ఐ జి.సతీష్ తెలిపారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీ నిమిత్తం నిల్వ ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి డ్రమ్ములను తగలబెట్టామన్నారు. ఈ దాడుల్లో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చోరీకి యత్నించిన ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

జనవరి 17న స్థానిక కంచి సంస్థాన చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రాభట్ల చింతామణిగణపతిశాస్త్రి ఇంట్లో గుప్త నిధుల వేట గురించి దొంగతనానికి వచ్చిన ఏడుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు..భీమవరం, బలుసుముడి ప్రాంతానికి చెందిన సితిని అర్జునరావు(43), రౌతులపూడి మండలం పైడిపాల గ్రామానికి చెందిన ఎలుగుబంటి సురేష్(39), జగ్గంపేట మండలం రాజపూడికి చెందిన బూసాల బాబూరావు(44), రాజపూడి సాయి బాబా గుడి ప్రాంతానికి చెందిన కందుల దొరప్రసాద్(61), విజయ నగరం పట్టణం గాజుల రెగా ప్రాంతానికి చెందిన పింద్రాల అప్పన్న (32), విజయనగరం అంబేద్కర్ కాలనీకి చెందిన ఆసనాల గోవింద్ (28), ఏలూరు జిల్లా కామవరపు పేటకు చెందిన గంటా యుగంధర్‌లను అరెస్టు చేసి కాకినాడ కోర్టుకు తరలించామన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం, మండల పరిధిలో సోమవారం పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి స్వాతి సామర్లకోట పట్టణంలోని శ్రావణి ఎరువుల దుకాణాన్ని, మండలంలోని వేట్లపాలెంలో సత్యసాయి ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. మండలంలో సక్రమమైన పద్ధతిలోనే ఎరువుల దుకాణాలు నిర్వహణ కొనసాగుతోందని ఎలాంటి లోపాలు తమ దృష్టికి రాలేదని ఆమె వివరించారు. ఈ తనిఖీల్లో ఇంకా మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, ఎఎఒలు సతీష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం - రక్షించిన స్థానికులు

మామిడికుదురు : పాశర్లపూడి - బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు రక్షించారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన నాగళ్ల సత్తిబాబు మానసిక ఒత్తిడితో ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిలో దూకాడు. సమీపంలో చేపల వేటకు వెళ్లిన మత్యకారులు కొల్లు నాగకృష్ణ, రాకేష్ వర్మ, నాని దీన్ని గుర్తించారు. నీటిలో దూకి సత్తిబాబును రక్షించారు. అనంతరం నగరం ఎస్ఐ ఎస్‌కె. జానీభాషా సమాచారం ఇచ్చారు.

పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, వేలివెన్ను గ్రామాల్లో పేకాట శిబిరాలపై సోమవారం దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.47,700నగదు, 11 సెల్ ఫోన్లు, కొన్ని పేకముక్కలు, స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.రామారావు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు స్టేషన్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. జూదాలను నిర్వహించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. రెండు సార్లు జూదాల్లో దొరికితే ఉన్నత అధికారుల అనుమతితో షీట్స్ ఓపెన్ చేస్తామన్నారు.



నాసిరకంగా సిసి రోడ్డు పనులు

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని సిరిపల్లి పంచాయతీ పరిధిలోని చెల్లేవారిపేటలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు వేయడానికి వేస్తున్న సిమెంట్ మాల్‌లో గ్రావెల్ రాళ్ళు, ఇసుక మాత్రమే కనిపిస్తున్నాయని, సిమెంట్ ఎక్కడా కానరావట్లేదని స్థానికులు తెలిపారు. ఇలా వేయడం వల్ల నెలరోజులకే రోడ్డు బీటలు వారి గుంతలు పడుతున్నాయని వాపోతున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని వారు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

శబ్ధ కాలుష్యంపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఏడిద రోడ్డులోని దుర్గమ్మ ఆలయం పక్క వీధిలో ఉంటున్న ప్రజలు శబ్దకాలుష్యంపై ఫిర్యాదు చేశారు. వీధిలో కొత్తగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశారని రాత్రి పగలు పెద్ద శబ్దాలతో పనులు చేస్తున్నారని వి.రామకృష్ణ, శ్రీను, చౌదరి మున్సిపల్ అధికారులకు తెలిపారు. రాత్రి సమయంలో నిద్ర పోవడానికి ఇబ్బందులతో పాటు విద్యార్థులు పరీక్షలు సమయం కావడంతో వారి చదువులకు ఆటంకాలు ఏర్పడుతుందని వారిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవగాహనతోనే పరీక్షల్లో విజయం

ఎపిఎ ఇండియా అధ్యక్షుడు కృష్ణ భరత్

ప్రజాశక్తి-రాజోలు

పరీక్షలో విద్యలో భాగమని, సరైన అవగహన ఉంటే వాటిల్లో విజయం సాధించడం కష్టమైన పని కాదని ఎపిఎ ఇండియా అధ్యక్షుడు, సైకాలజిస్ట్ కృష్ణభరత్ పేర్కొన్నారు. సోమవారం సైకాలజిస్టుల సంఘం ఎపిఎ ఇండియా ఆధ్వర్యంలో మలికిపురంలోని ఎంవిఎన్‌జెస్ అండ్ ఆర్‌వి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 10వ తరగతి విద్యార్థులకు విజయీభవ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ కృష్ణభరత్ మాట్లాడుతూ పరీక్షల పట్ల భయాన్ని వీడితే సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. పరీక్షలు ప్రతిభకు కొలమానం కాదనే విషయాన్ని గుర్తించాలన్నారు. పరీక్షలను విద్యలో భాగంగానే చూడాలన్నారు. సబ్జెక్ట్‌ను గుర్తు పెట్టుకోవడానికి ఎలా చదవాలి, పరీక్షల ముందు రోజు, పరీక్ష రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఎపిఎ ఇండియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సైకాలజిస్ట్ ఎంపీ జానకిరామ్ మాట్లాడుతూ ప్రత్యేక పద్ధతుల్లో ప్రిపేర్ అయితే సబ్జెక్టులపై పట్టు సాధించొచ్చన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. ఎపిఎ ఇండియా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పివివి.వరప్రసాద్ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా రాష్ట్ర లోని పదో తరగతి విద్యార్థుల కోసం విజయీభవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సహకరించిన పాఠశాల కరస్పాండెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అనుసంధాన కర్తగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ నక్క రమేష్‌బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంవి,సత్యనారాయణ మూర్తి, ఎపిఎ ఇండియా యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.తేజ, గౌతమ్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వి.రమణారావు, ఉపాధ్యాయులు రామకృష్ణ, సూర్యనారాయణ, విజ్ఞాన్, వికాస్, గౌతమ్ గూడపల్లి, ఎఫ్‌బిటి, వివేకానంద పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణభరత్

వినియోగదారుల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

జి.రాగంపేట సచివాలయంలో సోమవారం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన వినియోగదారుల మ్యాగజైన్స్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సదస్సులో వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారులు మోసాలకు గురైతే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదుచేసి న్యాయం పొందొచ్చన్నారు. ఈ సదస్సులో సంఘం సెక్రటరీ ఎం.భాస్కర్‌రావు, కెవివి.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎన్‌టి.శేఖర్‌బాబు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డి.అనిల్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.


మ్యాగ్‌జైన్స్ అందిస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

సాగర్ కళాశాలలో శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

యువ చైతన్య సేవాసమితి, నెహ్రూ యువ కేంద్ర యువజన వ్యవహారాలు, తూర్పుగోదావరి జిల్లా క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సాగర్ డిగ్రీ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. కమ్యూనిటీ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం,ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు వంటి వాటిపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. మొదటిరోజు శిక్షణ తరగతులలో సిడబ్ల్యూసి సభ్యులు జంగం సంతోషి లీడర్‌షిప్, వ్యక్తిత్వ వికాసం, అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం డిడి పిఆర్‌ఆర్ ప్రసాద్, ఫైర్ మాన్ సత్యనారాయణలు అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పిశ్రీదేవి, జి.సాయికృష్ణ, ఎం.అచ్యుత రామయ్య, ప్రిన్సిపల్ బి.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ నల్లా లీలావినోద్‌కుమార్, పోకల మణిమాల, సెక్రటరీ రాధా శ్రావణి, ఎన్‌వైకె వాలంటీర్లు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గేదెకు కేన్సర్ కణితి తొలగింపు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక రాష్ట్ర పశుసంవర్ధక శాఖ శిక్షణ కేంద్రంలో పశు వైద్యాధికారులు పాడి గేదెకు శస్త్ర చికిత్స చేసి కేన్సర్ కణితిని సోమవారం తొలగించారు. ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామస్తుడు బి.రాజబాబుకు చెందిన పాడిగేదెకు ఆరు నెలల క్రితం పొట్ట పైభాగంలో చిన్న కణితిలా వచ్చింది. ఇటీవల కాలంలో అది పెరగడంతో రైతు గేదెను మండపేటలో పశు సంవర్ధక శాఖ శిక్షణ కేంద్రానికి తీసుకొచ్చాడు. వైద్యులు పరీక్షించి అందని కేన్సర్ కణితిగా గుర్తించారు. అక్కడ వైద్యాధికారులు డిడి కె.కష్ణమూర్తి, విఎఎస్‌విజిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు 2 గంటల సెపు శ్రమించి శస్త్ర చికిత్స చేసి 2 కిలోల కణితిని తొలగించారు.


గేదెకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యులు

వారం పాటు ఆదిత్యలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్అపోలో సన్‌షైన్ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు వారం రోజలపాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని ప్రిన్సిపల్ ఆదిరెడ్డి రమేష్ సోమవారం ప్రారంభించారు. వారం రోజులపాటు విద్యార్థులకు పలు విభాగాల్లో నిపుణులైన వైద్యులతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పలు ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సోమవారం సుమారు 100 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ, వాలంటీర్లు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి- కరప

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాల్లో ఖర్చు చేయకుండా దుర్వినియోగం చేస్తుందని జనసేన పార్టీ పిఎసి సభ్యులు పంతం నానాజీ అన్నారు. పెనుగుదురులో సోమవారం ఎస్‌సి, ఎస్‌టి కాలనీలో, గ్రామ కమిటీ అధ్యక్షులు గంట నానిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను మళ్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.కొండబాబు, బి.గంగాధర్, వై.పండు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

టిడిపిలోకి పలువురు వైసిపి కార్యకర్తలు సోమవారం పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. కొండవరంలో గాది రాజబాబు, వేమగిరి రాంబాబు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి చెందిన పెండ్యాల శివ, మరికొందరు యువత ఈ సందర్భంగా టిడిపిలో చేరారు. వర్మ మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిసెట్టి సత్యానందరెడ్డి, గాది రాజబాబు, దుళ్ళ సత్తిబాబు, పార్టీ అధ్యక్షులు సత్తిబాబు, వేమగిరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాజీ ఎంఎల్‌ఎ వర్మ

'వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలేశ్వరంలో జరిగిన మండల గృహ సారథులు సచివాలయ కన్వీనర్ల శిక్షణా తరగతులకు నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్, రాష్ట్ర దృశ్య కళా చైర్మన్ కుడిపూడి శైలజలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం 93శాతం ఎన్నికల హామీలను అమలు చేసిందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలమండ సత్యవతి, వైస్ చైర్మన్ శిడగం త్రివేణి, చిక్కాల రాజ్యలక్ష్మి, సాదె లోవరాజు, లింగంపర్తి పిఎసిఎస్ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, వైసిపి నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పర్వత

ఘనంగా బల్లల పండుగ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

రజకులు ఆధ్వర్యంలో సోమవారం బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. అంగరలో శ్రీ రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఈ పండుగను నిర్వహించారు. విఘ్నేశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. గారడీలు, డప్పు వాయిద్యాలు, బాణా సంచా కాల్పులతో ఊరేగింపు జరిగింది. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. రజక సంఘం పెద్దలు ఎ.సూర్యనారా యణ, టి.వీరబాబు, ఎం.నాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

అవినీతిమయంగా వైసిపి పాలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వైసిపి ప్రభుత్వ పాలనంతా అవినీతి, దోపిడీల మయంగా మారిందని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు అన్నారు. 12వ డివిజనలో సోమవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను పంచారు. తొలుత గాంధీ, ఎన్‌టిఆర్ విగ్రహాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత, ఒమ్మి బాలాజీ, పేకేటి సూర్య భాస్కరరావు తదిరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మడికిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. రెండు కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు గళ్ల నాగవరలక్ష్మి, డి.సత్యవతి నివాసముంటున్న ఇంటికి సోమవారం తెల్లవారు జామున మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లో ఉన్నవారంతా ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఇంటో సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వైసిపి సీనియర్ నాయకులు ఉండ్రాజపు చిన్న, పడమటి రాంబాబు, విఆర్ఒ సుదర్శన్ బాధితులను పరామర్శించారు. కొంత ఆర్థిక సాయాన్ని, రైస్ ప్యాకెట్లను ఇరు కుటుంబాలకు అందించారు. ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని వారు తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : బండారు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు డిమాండ్ చేశారు. బాధితులు నాగవరలక్ష్మి, సత్యవతి కుటుంబాలను ఆయన పరామర్శించారు. బియ్యం, వంట పాత్రలు, దుప్పట్లతో పాటు ఆర్థిక సాయం అందించారు. బాధితులకు సాయం అందించాలని తహశీల్దార్‌తో మాట్లాడారు. ఆయన వెంట కె.కృష్ణ, ఈదల రమేష్, ఎం.ఏడుకొండలు, ఎ.సత్యనారాయణరాజు, జి.మూర్తి, బి.మారుతి, యు.రాజు ఉన్నారు.


సాయం అందిస్తున్న వైసిపి నాయకులు, విఆర్ఒ తదితరులు


సాయం అందిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ బండారు, టిడిపి నాయకులు

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 37/2018
ఓ.ఎస్.నెం. 152/2002

బిట్వీన్:
చప్పిడి స్వామినాధరావు ...డి. హెచ్.ఆర్
మరియు
1) బండారు వీరవెంకట సత్యనారాయణ, తండ్రి: లక్ష్మణరావు, రాయవరం, రామాలయం దగ్గర, పిఠాపురం మండలం.
2) సోమురౌతు శివ సూర్య ప్రకాశరావు, తండ్రి: సత్యనారాయణ మూర్తి, రాయవరం, రామాలయం దగ్గర, పిఠాపురం మండలం.
...జె.డి.ఆర్స్

సదరు పై నెంబరు అమలు గ్రంధములో శ్రీకోర్టువారు జె.డి.ఆర్స్ అయిన మీకు ఆర్డరు 21 రూలు 54 నోటీసులు ఎన్నిసార్లు పై అడ్రసుకి పంపించినప్పటికీన్నీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా తిరస్కరించుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు **ది. 09-02-2023కి వాయిదా వేసినారు. కావున ఆరోజు ఉదయం 10:30 గంటలకు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

తుమ్మలపల్లి సత్యనారాయణ
అడ్వకేట్, కాకినాడ-3.

In the Court of the Principal Senior Civil Judge, West Godavari District at Kovvur
S.O.P. No. 2 of 2022

పిటీషనర్: 1. శ్రీమతి లేళ్ల శేషారత్నం
2. శ్రీమతి గొడా సత్యవతి
3. శ్రీమతి లేళ్ల పవన్‌కళ్యాన్
మరియు
రెస్పాండెంట్స్: NIL

పై నంబరు పిటిషన్‌లో పిటిషనర్‌లని సక్ససర్‌లుగా గుర్తించుటకు మరియు లేటు రామచంద్రరావు గారు వారి జీవిత కాలంలో వారు నల్లజర్ల గ్రామంలో గల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో పొదుపు ఖాతాలో ఉన్న **రూ. 1,57,600/-లు** తీసుకొనుటకు అనుమతి కోరుతూ శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కొవ్వూరు కోర్టులో పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ ఎస్.ఒ.పి. నెం. 2/2022 రులో శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు.

కావున పై నంబరు పిటిషన్‌లో పిటిషనర్‌లని సక్ససర్‌లుగా గుర్తించుటకు ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల **ది. 16-02-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై వారి ఆక్షేపణలు తెలియపరచుకోవచ్చును. లేనియెడల కోర్టు వారు తదుపరి ఉత్తర్వులను జారీ చేసెదరని ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

స్థలం: కొవ్వూరు **ఎన్.బి.కాంతిధర్**
ది.వి.06-02-23 అడ్వకేట్/పిటిషనర్



శిబిరాన్ని పరిశీలిస్తునన నిర్వాహకులు

150 మంది రక్తదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

కాకినాడ, పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో పెద్దాపురం సాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు శివారులోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. సాయి సేవా సమితి సభ్యులు అద్దేపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి లక్ష్మణరావు, ఎ.రమేష్, రాజేష్, జి.సునీల్, జి.వాసు, హెచ్‌వి.చంద్రశేఖరశర్మ, పి. వేణుగోపాలకృష్ణ, బి.బుజ్జి, పి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి గంగమ్మ జాతర

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెదబ్రహ్మదేవం మంచినీటి చెరువు గట్టు వద్ద దొడ్డి గంగమ్మతల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. చింతలూరు కళాకారుల గరగల నృత్యం, డప్పు వాయిద్యాలతో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో తోటకూర గంగాధర్, వారి కుటుంబాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

10 నుంచి సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని సచివాలయాల్లోని కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులకు ఈనెల 10న తహశీల్దార్ పాత కార్యాలయం ఎదురుగా ఉన్న లే-అవుట్‌లో పిఠాపురం ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ కార్యాలయ అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మొదట గ్రూప్, మధ్యాహ్నం రెండు గంటలకు రెండో గ్రూప్‌నకు ఈ శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

లిబరేషన్ జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి- రౌతులపూడి

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 15న నిర్వహించనున్న సిపిఐ ఎంఎల్ లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారాజు కోరారు సోమవారం రౌతులపూడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024 సాధారణ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణమూర్తి ఉన్నారు

పాస్‌పోర్టు పోయినది

పూర్వం తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ అర్బన్ మండలం, సంజయ్ నగర్, డో.నెం. 17-8-13ఎ, కాపురస్తులు **నీలం గంగాధరమ్ గారి భార్య నీలం లక్ష్మి** గారు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.., నా యొక్క **ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. W0775817** ను జిరాక్సు నిమిత్తం ది.31-01-2023వ తేదీన మా ఇంటి నుండి 3టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా జయరెసిడెన్సీ హోటల్ దగ్గరలో గల జిరాక్సు షాపుకు వెళ్తుండగా పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

నీలం లక్ష్మి, భర్త: గంగాధరమ్,
డో.నెం. 17-8-13ఎ, సంజయ్ నగర్,
కాకినాడ అర్బన్ (మం), కాకినాడ జిల్లా.
సెల్: 90631 71667

దావా సమను ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
O.S.No.21/2019

వాది: మావిరెడ్డి కిషోర్ వగైరా
అండ్
ప్రతివాదులు: మావిరెడ్డి శ్రీనివాసు వగైరా
ప్రతివాది-3:
కొవ్వూరు నాగ వెంకట సుధాకర రెడ్డి, తండ్రి: రామకృష్ణ రెడ్డి, వ్యాపారం, డో.నెం. 7-35, పసలపూడి, రాయవరం మండలం.

పై నెంబరు దావా పరిహారం నిమిత్తం మీ పై కోర్టులో వాది అను వారు ప్రతివాదిగా చేర్చి దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియజేయుటకు మీరు పై కోర్టు వారి ఎదుట **ది.09-02-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

తటవర్తి సత్యనారాయణ
వాది తరపున అడ్వకేట్,
ఓల్డ్ కాలేజి స్ట్రీట్, పెద్దాపురం.
సెల్: 98856 57091

నోటీసు ప్రకటన
మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి సముఖమునకు
I.A.No.526/2019
in O.S.No.21/2019

పిటీషనరు: మావిరెడ్డి కిషోర్ వగైరా
అండ్
రెస్పాండెంటు: మావిరెడ్డి శ్రీనివాసు వగైరా
రెస్పాండెంటు-3:
కొవ్వూరు నాగ వెంకట సుధాకర రెడ్డి, తండ్రి: రామకృష్ణ రెడ్డి, వ్యాపారం, డో.నెం. 7-35, పసలపూడి, రాయవరం మండలం.

పై నెంబరు దావా పిటీషను పరిహారం నిమిత్తం మీ పై కోర్టులో పిటీషనరు ఇంజెన్షన్ పిటీషనులో పార్టీగా చేర్చుమని పిటీషను దాఖలు చేసినందున అందుకు ఆక్షేపణలు తెలియజేయుటకు మీరు పై కోర్టు వారి ఎదుట **ది.09-02-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

తటవర్తి సత్యనారాయణ
పిటీషనరు తరపున అడ్వకేట్,
ఓల్డ్ కాలేజి స్ట్రీట్, పెద్దాపురం.
సెల్: 98856 57091